జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 5-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 238 పేజీలు: 4 వెల : రూ.7





# వీవీఐపీ సేవలోనే..

## ఆలయ, దేవదాయ శాఖాధికారులు





* ఆదాయంపైనే దృష్టి తప్ప.. సామాన్యులను పట్టించుకోని ఆలయాధికారులు * రూ.300, రూ.500, డోనర్ పాసులు ఎన్ని కొట్టారో ఆ పెరుమాళ్‌కే ఎరుక * డోనర్ పాస్‌లు కన్నా డ్యూటీపాస్‌లే అధికం * రూ.100లు క్యూలైన్లలో గంటలతరబడి భక్తుల నిరీక్షణ * రెవెన్యూ, దేవదాయ, రెవెన్యూ శాఖల మధ్య కొరవడిన సమన్వయం * ఆలయాధికారులు, దేవదాయశాఖాధికారులు ఆలయంలోపలే * కలెక్టర్, ఎస్పీలు.. రోజంతా క్యూలైన్లలోనే పర్యవేక్షణ * వీరిద్దరి వల్లే రాష్ట్ర పండుగ.. రథసప్తమి విజయవంతం * క్షీరాన్నం చేసుకునేందుకు భక్తుల తిప్పలు * క్యూలైన్లలో భక్తులకు మంచినీరు ఇవ్వని దేవస్థానం అధికారులు * లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు * భాస్కరాయ నమోనమ: అంటూ మార్మోగిన అరసవల్లి * ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించని అధికార పార్టీ నేతలు * చూసీచూడనట్టు వ్యవహరించిన జిల్లా అధికారులు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో మంగళవారం జరిగిన రథసప్తమి వేడుకలకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి క్షీరాభిషేకం, నిజరూప దర్శనం చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. కిలోమీటర్లు మేర క్యూలైన్లు భక్తజనంతో కిటకిటలాడింది. రూ.100, రూ.300, రూ.500, దాతల క్యూలైన్లు రద్దీగా మారాయి. ఉచిత దర్శనం క్యూలైన్లలో ఇసుకవేస్తే రాలనంతగా జనంతో నిండిపోయింది. ఆలయాధికారులు, దేవదాయ శాఖాధికారులు వీవీఐపీల సేవలోనే తరించారు. ఆలయం లోపలే ఉండిపోయారు. బయట ఏం జరుగుతుందన్నది పట్టించుకోలేదు. వీవీఐపీలకు కండువాలు కప్పడం, ఫొటోలకే పరిమితం కావడం, దగ్గరుండి స్వామి వారి దర్శనం చేయించడానికే పరిమితమయ్యారన్న విమర్శలు భక్తుల నుంచి వినిపించింది. ఆదాయంపైనే దృష్టి తప్ప సామాన్య భక్తుడి తిప్పలను పట్టించుకోలేదు. రూ.100, రూ.300, రూ.500, డోనర్ పాసులు ఎన్ని ఇచ్చారన్నది ఏ ఒక్క దేవదాయ, సూర్యనారాయణస్వామి దేవస్థానం అధికారుల వద్ద సరైన లెక్కా పత్రం లేదు. ఆలయాభివృద్ధికి లక్ష రూపాయలకు పైనే విరాళం ఇచ్చిన వారిని సైతం దేవస్థానం అధికారులు ఈసారి పట్టించుకోలేదు. సామాన్యుడు స్వామి వారి దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పిన ఆలయాధికారులు వారిని విస్మరించింది. ఎండలో క్యూలైన్లలో ఉన్న భక్తులకు కనీసం నీరు, మజ్జిగ పంపిణీ చేయలేదన్న అపవాదును దేవదాయ శాఖ మూటగట్టుకుంది. ఇక రథసప్తమి రోజున ఇంద్రపుష్కరిణి వద్ద భక్తులు క్షీరాన్నం వండి స్వామి వారికి నైవేద్యం చెల్లిస్తారు. ఈసారి ఇంద్రపుష్కరిణి చుట్టూ క్యూలైన్లు ఏర్పాటు చేయడం వల్ల క్షీరాన్నం ఎక్కడ వండాలో తెలియక భక్తులు అవస్థలు పడ్డారు. చివరకు పుష్కరిణికి దూరంగా నిర్మానుష్య ప్రదేశంలో కొందరు క్షీరాన్నం వండి స్వామి వారికి నైవేద్యం పెట్టడం కనిపించింది. దేవదాయ, ఆలయాధికారులు ఆలయం అనివెట్టి మండపం వద్ద ఎంజాయ్ చేస్తుంటే.. ఆలయం బయట జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్, ఆర్డీవో ప్రత్యూషలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లలో ఇబ్బందులు లేకుండా వారంతా సమష్టిగా తమపని తాము చేసుకున్నారు. సింహద్వారం వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ ద్వారా సమస్యలను గుర్తించి అప్పటికప్పుడు పరిష్కరించేలా చొరవ తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకూ వారంతా ఇక్కడే మకాం వేశారు. రాత్రి ఏడు గంటల తర్వాత అన్ని క్యూలైన్లు ఉచితం చేసి ఎక్కువ మంది సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఏకంగా క్యూలైన్లలోనే కాపు కాయగా, ఎస్పీ అయితే భక్తులు క్యూలైన్ల ద్వారా వెళ్లేలా చొరవ తీసుకున్నారు. ఎక్కడ కూడా తోపులాట చోటుచేసుకోకుండా పర్యవేక్షించారు. అధికార పార్టీ నేతలు ఎన్నికల కోడ్‌ను పట్టించుకోకపోయినా అధికారులు చూసీచూడనట్టు వదిలేశారు. రాష్ట్ర పండుగ రథసప్తమి వేడుకలు విజయవంతం కావడానికి, ఎటువంటి అపశృతులు చోటుచేసుకోకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీలు కారణమని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడ్డారు.





## గిరిజన విద్యార్థికి గోల్డ్ మెడల్

**సీతంపేట, ఫిబ్రవరి 4(వార్త):** సీతంపేట మండలం పెద్దూరు గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఆరిక యగ్నిక్ అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో 8వ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు ఇటీవల నిర్వహించారు. ఈ క్రీడాకారుడిని మంగళ వారం ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల క్రీడాకారులతో పోటీపడి గోల్డ్ మెడల్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో మాస్టర్ కోచ్ తోట సింహాచలం, కోచ్ ఆరిక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



# రథసప్తమి ఉత్సవాలపై భక్తుల హర్షం

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** రాష్ట్ర పండుగ రథసప్తమి వేడుకల్లో భాగంగా శ్రీ సూర్యనారాయణ స్వామి వారి సందర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లు పై భక్తులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. దర్శనం అనంతరం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నవి నడుచుకుంటూ వచ్చే భక్తులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అరసవల్లిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ఉన్న టీవీల ద్వారా డ్రోన్లు, సిసి కెమేరాలు ద్వారా వచ్చే ఫుటేజీలను క్యూ లైన్లు, తదితర వాటిపై కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు భక్తుల గుంపులను దృష్టిలో ఉంచుకొని ఆర్డీఓలకు కలెక్టర్, జెసిలు పలు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే భక్తుల గుంపులను జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి డిఎస్పీలు సిఐలకు క్యూ లైన్ల లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రతలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్శనానికి వచ్చే భక్తులకు అందుబాటులో మెడికల్ టీంలు, వృద్ధులు, విభిన్న ప్రతిభా వంతులను వీల్ చైర్లు ద్వారా విభిన్న ప్రతిభా వంతులు, రెడ్ క్రాస్ సంస్థలు దర్శనానికి చేరవేశారు. దర్శనాలు వేగవంతం అయ్యే విధంగా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. వచ్చే భక్తులకు ఎక్కడికక్కడ తాగునీరు, ప్రసాదాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, ప్రసాదాలు, భోజనాలు, మజ్జిగ, తదితర ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ సిబ్బంది శానిటేషన్ లో పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. రాష్ట్ర పండుగ రథసప్తమి విజయవంతయ్యేలా సహకరించిన జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం, పలుస్వచ్ఛంద సంస్థలు, తదితరులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# హెలీ టూరిజంతో సరికొత్త అనుభూతి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** రథసప్తమి వేడుకల్లో భాగంగా, శ్రీకాకుళంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న హెలీ టూరిజం విహారం నగర ప్రజలకు సరికొత్త అనుభూతిని పంచుతోంది. డచ్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన హెలికాప్టర్ ద్వారా నగరంలోని అందమైన ప్రదేశాలను విహంగ వీక్షణం (ఏరియల్ వ్యూ) ద్వారా తిలకించవచ్చు. ఈ హెలీ టూరిజానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. మొదటి మూడు రోజుల్లో వందలాది మంది హెలికాప్టర్ రైడ్ చేసి ఆనందించారు. ఢిల్లీ నుండి ప్రత్యేకంగా తెప్పించిన హెలికాప్టర్ ద్వారా 8 నిమిషాల పాటు నగరాన్ని చుట్టి రావొచ్చు. ఒక్కో టికెట్ ధర రూ.2000 కాగా, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో రూ.1800 కే అందుబాటులో ఉంది. ఆన్లైన్, ఆఫ్లైన్లో టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రజల నుండి వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, హెలీ టూరిజంను మరో రోజు పొడిగించే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. రోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు హెలికాప్టర్ సవారీ నిర్వహిస్తున్నారు. గగనవీధి నుండి అరసవిల్లి ఆలయ గోపురాన్ని చూడటం ఈ రైడ్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెలీ టూరిజం ప్రారంభమైన ఆదివారం 200 మంది హెలికాప్టర్లో విహరించగా రూ.3.60 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం 270 మంది హెలికాప్టర్ ఎక్కగా, 45 రౌండ్లలో రూ.4.86 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం కూడా ఇదే స్థాయిలో 45 రౌండ్లలో పర్యాటకులు గగన విహారం చేశారు. ఒక ట్రిప్పుకి ఆరుగురు చప్పున రోజుకు 270 మంది వరకూ హెలికాప్టర్లో విహరిస్తున్నారు. గగన వీధిలో నుంచి అరసవిల్లి ఆలయ గోపురాన్ని చూసి పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




# నర్సింగపురం ఒడియా పాఠశాలను సందర్శించిన ఎంఈవో



**-తాత్కాలికంగా మంచినీరు ఏర్పాటు -పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరిస్తామని హామీ -'వార్త'కు స్పందన**

**మందస, ఫిబ్రవరి 4(వార్త):** మందస మండ లంలోని నర్సింగపురం ఒడియా పాఠశాల కష్టాలు గట్టెక్కనున్నాయి. 'నర్సింగపురం ఒడియా పాఠ శాలకు కష్టాలు' అనే శీర్షికన పాఠశాల సమస్యలను జాతీయ వార్త ఈ నెల మూడున వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు మందస మండల విద్యాశాఖాధి, కారి మర్రిపాటి లక్ష్మణరావు మంగళవారం పాఠ శాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు జయరాం మాలితో మాట్లాడి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. మంచినీరు ప్రధాన సమస్యగా ఉందని, ప్రహరీగోడ కూడా తక్షణం అవసరమని జయరాం మాలి ఆయనకు వివరించారు. ఎంఈఓ లక్ష్మణరావు స్పందించి, పక్కనే ఉన్న సచివాలయం సిబ్బందితో మాట్లాడి విద్యార్థులు ఇబ్బందిలేకుండా ఉండేందుకు తాత్కాలికంగా సచివాలయంలో ఉన్న నీరు అందివ్వా లని ఆదేశించారు. పాఠశాలను వేధిస్తున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి, సమస్యలు పరిష్కారానికి ప్రజలు సహకరించాలని కోరారు.

# మంత్రి లోకేష్ దృష్టికి ప్రైవేట్ టీచర్స్, అధ్యాపకుల సమస్యలు



**సోంపేట, ఫిబ్రవరి 4(వార్త):** ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకుల సమస్యలపై సోమవారం రాత్రి మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళ్ల లోకనాథం చర్చించారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చట్ట ప్రకారం సిబ్బందికి కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపా యాలు కల్పించడం లేదని, ప్రభుత్వం నిర్దేశించిన పని గంటల కన్నా, సెలవు రోజుల్లో కూడా తరగతి నిర్వ హించడంతో అటు విద్యార్థులు ఉపాధ్యాయులు కూడా మానసిక శారీరక ఒత్తిడికి గురై అనారోగ్యాలు పాలై కొంత మంది విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మ హత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస హక్కులను యాజమా న్యాలు కల్పించేలా విద్యా శాఖ అధికారులకు స్పష్టమైన అదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్ మాట్లా డుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో సుమారు 20 నుంచి 30 సంవత్సరాలు పాటు పని చేసిన ప్రైవేటు ఉపాధ్యా యులకు రిటైర్మెంట్ వయసులో వారికి యాజమాన్యం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం లభించడం లేద న్నారు. ప్రైవేటు టీచర్లను ఆదుకోవడానికి ఒక సంక్షేమ పథకాన్ని తీసుకుని వచ్చి మా కుటుంబాలను ఆదు కోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఆలోచన చేసి, ప్రైవేటు టీచర్లు లెక్చరర్స్ యొక్క సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చార న్నారు. రాష్ట్ర నాయకులు స్కూల్ ఎడ్యుకేషన్ కమిష నర్ విజయరామరాజు, డైరెక్టర్ పార్వతి, జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, ఇంటర్మీడియట్ కమిషనర్ కృత్తికా శుక్లాకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో సమస్యలను వివరించి రిప్రజెంటేషన్ ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టు శ్యాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జి.రషీద్, కర్నూలు అధ్యక్షులు చాంద్ బాషా, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ కస్తూరి తేజస్విని ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మందసలో జ్యూయలరీ షాపు ప్రారంభం

**మందస, ఫిబ్రవరి 4(వార్త):** మందస మంగళవారం పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా శ్రీరామా జ్యూయలర్స్‌ను ప్రారంభించారు. అనంతరం శిరీష తమతో షాపు ఓనర్ కిల్లంశెట్టితో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. యువకులు స్వయం ఉపాధి వైపు కూడా అడుగులు వేసి, అభివృద్ధి చెందాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతాపార్టీ, గౌతు కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ నేవీ, ఆర్మీ వీరులకు ఘన స్వాగతం




**మందస, ఫిబ్రవరి 4(వార్త):** సుదీర్ఘ కాలంపాటు భరతమాత సేవలో తరించి, సేవలకు స్వస్తి పలికిన నేవీ, ఆర్మీ వీరులకు ఘన స్వాగతం లభించింది. మందస మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన గౌరకల రామ్మూర్తి, మోహినమ్మ దంపతుల కుమారుడు రమేష్ 15 సంవత్సరాల పాటు నేవీలో పని చేసి, ఉద్యోగ విమరణ చేసి, సొంత ఊరుకు చేరుకోవడంతో ఆయనకు కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు, అభిమానులు, మాజీ సైనికులు ఘన స్వాగతం పలికారు. దేశ రక్షణలో రమేష్ అందించిన సేవలను కొనియాడారు. మఖరజోల పంచాయతీ అల్లిమెరక గ్రామానికి చెందిన గౌరకల దుర్యోధన దంపతుల కుమా రుడు గౌరకల మోహనరావు ఆర్మీలో 24 సంవత్సరాలు సేవలందించి, ఉద్యోగ విరమణ చేసి.. స్వగ్రామానికి చేరుకోవడంతో ఘన స్వాగతం పలికారు. పూల మాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. దేశ రక్షణలో సైనికులు చూపుతున్న ధైర్య, సాహసాలను కొనియాడారు.

## పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయ పరిధిలో పారా లీగల్ వలంటీర్ల నియమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్ చార్జి మెజిస్ట్రేట్ సీహెచ్ హరిప్రియ తెలిపారు. పదవీ విరమణ పొందిన వారు అంగన్‌వాడీ కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్ప థం కలిగిన ప్రభుత్వేతర సంఘం సభ్యులు, స్వయం సహాయక సభ్యులు అర్హుల న్నారు. ఈనెల ఏడో తారీఖులోగా దరఖాస్తులను పలాస జూనియర్ కోర్టుకు అందజేయాలని ఆమె సూచించారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**మందస, ఫిబ్రవరి 4(వార్త):** మందస మండలంలో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా పరామర్శించారు. సిరిపురం పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన దండాసిరావు, భోగాపురానికి చెందిన బేసి గణపతి, కొత్తపేట గ్రామంలో సీనియర్ కార్యకర్త ధర్మాన కారయ్య లు ఇటీవల మరణించారు. మృతుల కుటుంబాలను శిరీషా పరామర్శించి, వారిని ఓదార్చారు. పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించి ఓదార్చారు. తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆమెతో పాటు మందస మండల టీడీపీ అధ్యక్షుడు భావన దుర్యోధన, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, పీరికట్ల విఠల్ రావు, కార్యదర్శి లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్ కుమార్, గార కృష్ణరావు, బత్తిని తారక్, పత్రి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శివనంద గిరి పై రధసప్తమి పూజలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4(వార్త):** బెల్లుపడ శివనంద గిరి పై రధసప్తమి పూజలు నిర్వహించారు. భక్తులు సూర్య నమస్కారాలు చేసి పూజలు నిర్వహించారు. అలాగే సామూహిక చిత్రగుప్త వ్రతములు, పదహారూఫలాలనోములు, పాలగౌరి పెరుగుగౌరి, ఉప్పుగౌరి, తౌడుగౌరి నోములు పట్టి ఉద్యాపనం చేసుకున్నారు.స్థానిక నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయంలో దైవ్ఞ శ్రీ తెన్నేటి తేజేశ్వర శర్మ గారి ఆధ్వర్యంలో జరిగాయి.





## రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** అరసవల్లిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ఉన్న సిసి కెమేరాలు, డ్రోన్ల చిత్రాలు ద్వారా భక్తులు సందర్శన, భక్తుల రాకపోకలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. ఆలాగే ఇంద్రపుష్కరిణిని పరిశీలించి అక్కడ భవిష్యత్తులో చేయవలసిన ఏర్పాట్ల పై పరిశీలించి చర్చించారు. ఈ పరిశీలనలో పలాస ఆర్డీఓ జి. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి మంగళవారం కళింగపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి భద్రతా దృష్ట్యా తీర ప్రాంత ముందస్తు సమాచార సేకరణ విషయమై ఆరా తీశారు. తీర ప్రాంతంలో గస్తీ పెంచుతూ భద్రత పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. సముద్రతీర ప్రాంతంలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పై నిఘా పెట్టాలన్నారు. సిబ్బంది వివరాలు, పనితీరుపై ఆరా తీసి ప్రతి ఒక్కరు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## టాలెంట్ టెస్ట్‌లో రాణించిన చిన్నబాడాం విద్యార్థి



**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల చిన్న బలం హైస్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న జొన్నకోటి సిద్దార్ద జిల్లా స్థాయి ఈఈ మెరిట్ పోటీలలో మూడవ స్థానం సంపాదించారు. ఈ విద్యార్థి ఎటువంటి కోచింగ్ శిక్షణ పొందకుండానే ఈ మెరిట్ సాధించడం విశేషం. ఈ విద్యార్థి స్కూల్ తరగతి లో కూడా అనేక ప్రతిభ పాటవాలు చూపిస్తూ ఉపాదయుల అభిమానాన్ని చూర గోన్నాడు. ఈ సిద్దార్థ అద్భుతంయినా చిత్ర లేఖనం లో గొప్ప ప్రతిభ కన్ బరుస్తున్నాడు. ఈయన తండ్రి కోర్పెంటర్ వృత్తి గా జీవిస్తూ సింహాచలం కుటుంబాన్ని భారంగా నెట్టుకోస్తు తన ఇద్దరు కొడుకులను ప్రయోజకులు చేసే దిశగా ఆయన తన శక్తికి మించి కుమారులను తీర్చి దిదడుతున్నారు. పెద్ద కుమారుడు జయదీప్ తొమ్మిదవ తరగతి చదువుతూ స్పోర్ట్స్ లోఅనూహమైనా ప్రతిభ కనబరుస్తుంద్దాడంతో ప్రధానోపాద్యాలు అభినందనలు తెలియ జెస్తున్నారు.

## ఈదుపురంలో పాల కేంద్రం ప్రారంభం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4(వార్త):** ఈదుపురంలో ఆరు లక్షల రూపాయలు నిధులతో నిర్మించిన విశాఖడైరీ పాల సేకరణ కేంద్రం ను ఎంపీటీసీ ప్రతినిధి నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. సుమారు రెండు దశాబ్దాలుగా అద్దె భవనంలో పాల సేకరణ నిర్వహించడం పాడి రైతులకు కొంత ఇబ్బందిగా ఉండేది నేటినుండి ఆ ఇబ్బందులు తొలిగిపోయాయని ప్రేమ్ తెలిపారు .అంతేకాకుండా గతంలో పాడిరైతులు పాలను దగ్గరలో ఉన్న పట్టణానికి వెళ్లి పాలను విక్రయించేవారని, విశాఖ డైరీ రాకతో పాడి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ సూపర్ వైజర్ ప్రసాద్ పాడి రైతులు నర్తు భానోజీ రావు, నర్తు మామయ్య, జుత్తు యర్రయ్య, దాసరి నూకయ్య ,దట్టి ఢిల్లీ రావు, దట్టి ఉమాపతి,కలక్షన్ ఏజెంట్లు వైకుంఠం, పురుషోత్తం ,గోపి తదితరులు పాల్గొన్నారు.



# సోలార్ ప్లాంట్లదే భవిష్యత్

**-ప్రభుత్వ విప్ అశోక్, ఎమ్మెల్యే శిరీష**

**సోంపేట, ఫిబ్రవరి 4(వార్త):** సోలార్ ప్లాంట్ లదే భవిష్యత్ అని, సోలార్ పట్ల ప్రజలు ఆశక్తి చూపాలని ప్రభుత్వ విప్ డాక్టర్ బి.అశోక్ బాబు, పలాస ఎమ్మెల్యే గౌతు. శిరీష ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సోంపేట మండలం జింకిభద్ర జంక్షన్ పరిధిలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి బీన వంశీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పవన్ సాయి మైరే సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూమ్ ను ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం నియోజవర్గ ఎమ్మెల్యే అశోక్ బాబు, పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు.శిరీష ఇచ్ఛాపురం జనసేన సమన్వయకర్త దాసరి రాజు లు చేతుల మీదగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వంశీ ప్లాంట్ కోసం వివరిస్తూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం గృహ వినియోగదారులు మాత్రమే వర్తిస్తుందని మూడు కిలోవాట్ 36 యూనిట్లు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తుందని ఇంటి పై కప్పు కనీసం 300 చదరపు అడుగుల స్థలం ఏర్పాటుకు ఉండాలని ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకు లభిస్తాయని 78 వేల రూపాయలు



రాయితీ వర్తిస్తుందని సోలార్ సిస్టంపై పలు అంశాలను ప్రజా ప్రతినిధులకు వివరించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు చుట్టుపక్క గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# మార్చి 8న రాయపూర్‌లో తెలుగు మహాసభలు

**-కన్వీనర్ రుద్రమూర్తి**

**సోంపేట, ఫిబ్రవరి 4(వార్త):** ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర రాజధాని రాయపూర్ లో మార్చి 8, 9 తేదీలలో రెండు రోజుల పాటు ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర స్థాయి తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్లు మహాసభల కన్వీనర్ లండ రుద్ర మూర్తి తెలిపారు. మంగళవారం విజయవాడ బంకింగ్ హం పోస్టాఫీస్ ఎదురుగా గల ప్రపంచ తెలుగు రచయితల మహాసభల కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మహాసభ వివరాలను రుద్ర మూర్తి వివరించారు. ఈ సభలకు ఛత్తీస్ ఘడ్ లోని వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్న తెలుగు సంఘాల ప్రతినిధులు, భాషాభిమానులు కనీసం 3,000 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆహ్వానించినట్లు తెలిపారు.అలాగే ఛత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్, ఉప ముఖ్యమంత్రులు అరుణ్ సావ్, విజయశర్మ, సాంస్కృతిక శాఖామాత్యులు అజయ్ చంద్రాకర్ పాల్గొంటున్నట్టు తెలిపారు. కేంద్రమంత్రి,శ్రీకాకుళం ఎంపి రామ్మోహన నాయుడు, సాంస్కృతిక శాఖామాత్యులు కె. దుర్గేష్, ఆరోగ్య శాఖామాత్యులు సత్య కుమార్ యాదవ్ మరియు విద్యా మంత్రి నారా లోకేష్, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ళ మల్లికార్జున రావులను ఆహ్వానించామని తెలిపారు. సభల్లో జరిగే సాహిత్య చర్చల్లో డా. పసునూరి రవీందర్( హైదరాబాద్), డా.విజయ భాస్కర్ (శ్రీకాకుళం), బాల సుధాకర్ మౌళి ( విజయనగరం), ఎన్. వేణుగోపాల్ (హైదరాబాద్) డా.సుంకర గోపాలయ్య (తాడేపల్లిగూడెం), ప్రొఫెసర్ వినోదిని ( కడప), సిరికి స్వామి నాయుడు ( పార్వతీపురం), పిల్లా తిరుపతిరావు ( రాజాం), బద్రి కుర్మారావు (విజయనగరం), డా. జి వి పూర్ణచందు (విజయవాడ) తదితర సాహిత్యకారులు పాల్గొంటున్నారని, రెండు రోజులు పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. విలేకర్ల సమావేశంలో ఛత్తీస్ ఘడ్ తెలుగు మహా సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్, కార్యవర్గ సభ్యులు కొండప్ప వెంకటరావు, ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, ప్రధాన కార్యదర్శి డా. జి వి పూర్ణచందు పాల్గొన్నారు.



# సప్త కిరణాల సముదాయం సూర్య నమస్కారాలు

**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రథసప్తమి సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సూర్య నమస్కారములు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సూర్య నమస్కారములు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ సూర్యునిలో సప్త కిరణములు ఉంటాయని ఒక్కొక్క కిరణం యొక్క ఉపయోగమును వివరిస్తూ మన భారత దేశ వేదములలో ఉన్న కిరణములు యొక్క ప్రాముఖ్యతను ఒక్కొక్కటిగా వివరించి నారు. సుషుమ్నము అనే కిరణం పక్షపాతం రాకుండా కాపాడుతుంది, హరికేసం అనే కిరణం గుండెలో కొవ్వు కరిగిస్తుంది, విశ్వ కర్మము అనే కిరణము రక్తంలో ఐరన్ పెంచుతుంది, విశ్వవ్యచం అనే కిరణము ఊపిరితిత్తులకు క్షయ దగ్గు రాకుండా చేస్తుంది సంపద్వసము అనే కిరణము జనన అవయవమును మెరుగుపరుస్తుంది, అర్వగ్వసం అనే కిరణము నరాల బలహీనతను తగ్గిస్తుంది, స్వర ద్వసము అనే కిరణము స్వరపేటికను మెరుగుపరుస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి మధు సూర్య నమస్కారములు యొక్క ప్రయోజన వివరిస్తూ శరీరము అంతటికి వ్యాయామము గుండెకు రక్తప్రసరణ సక్రమంగా శ్వాసక్రియ పద్ధతిగా జరుగుతుంది అని వినాళగ్రందులు సమన్వయంతో పాటు ,హార్మోన్లు క్రమ బద్దికరించి రోగనిరోధక శక్తి పెరుగుతుంది అని నాడులు సున్నితంగా సాగదీయ బడి మెదడును ఉత్తేజం చేస్తుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. వెంకటరమణ ఐక్యూ ఏ సి కోఆర్డినేటర్ సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్ శ్రీనివాస పట్నాయక్, విద్యార్థులు, వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




# జీవామృతంతో పండే పంటలతో ఆరోగ్యం

**వంగర, ఫిబ్రవరి 4(వార్త):** జీవామృతం వల్ల పెంచిన కాయ గూరలు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, అనారోగ్య సమస్యలు కు దూరంగా ఉంటారని జీవామృతం మరువాడ యూనిట్ ఇంచార్జీ అర్నేపల్లి సింహాద్రి నాయుడు అన్నారు. మంగళవారం వంగర మండలం లోని మరువాడ ప్రకృతి వ్యవసాయ యూనిట్ కు సంబంధించి కింజంగి గ్రామం లో ఐ సి ఆర్ పి వేమిరెడ్డి పోలినాయుడు సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి అచ్చటనే జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఈ విధంగా పండించిన కూర గాయలు, ఆకు కూరలు వల్ల అనారోగ్య సమస్యలు రావని ఆయన వివరించారు.అనంతరం రెండు నెలల క్రిందట ఏటిఏం మోడల్ వేయించడం జరిగిందన్నారు. పొలంలో 20 సెంట్లు విస్తీర్ణం లో నాలుగు (4) అడుగులకు ఒక్కొక్క బెడ్డు కి మధ్య అడుగు బట్టి వేయించి ప్రతి బెడ్ ప్రక్కన వరుసుగా వంగ మొక్క దానికి అడుగున్నర దూరంలో టమాటా మొక్క, మరో అడుగున్నర కు ఈవిధంగా వీటిని పంపకం ఆకుకూరలు పంటలకు జీవామృతం ఉపయోగించడం వల్ల నిరంతర ఆదాయ మోల్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. పొలంలో బట్టి ప్రక్కన తీగ జాతి బీర , చిక్కుడు గట్టు పైన ముల్లంగి వేయించడం జరిగిందని, వీటి నుండి వచ్చే కూర గాయల ఆకు కూరల నుండిరైతుకు సరియైన ఆదాయం రావటం జరుగుతుందన్నారు.ఈ మొక్కలకు రసాయనిక ఎరువులు యూరియా డియేపి కి బదులుగా జీవామృతం వల్ల ఉపయోగాలను రైతులకు ఆయన వివరించారు. దీనితయారికి 100 లీటర్ల నీరు ఒక డ్రంలో వేసి అందులో రెండు కిలోల సెనగ పిండి ,రెండు కిలోల నల్ల బెల్లం ,10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల ఆవు పేడ, పుట్ట మట్టి ఒక కిలో అన్ని కలసి డ్రం లో వేసి రోజు ఉదయం సాయంత్రం ఒక కర్ర తో సవ్య దిశలోకలపాలనిదీని పై ఒక గోని సంచి తో కలిపి వారం రోజులు కి జీవామృతం తయారు అవుతుందని, ఇలా తయారైన జీవామృతం మొక్క కి వేయొచ్చని నీ,లేదా నీటిలో కలిపి పిచికారి చేయవచ్చ న్నారు. మొక్క పెరుగుదల చీడ పీడలు రాకుండా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఐ సి ఆర్ పి పోలినాయుడు, మహిళా రైతులు , రైతులు పాల్గొన్నారు.



# వంగర హౌసింగ్ ఏఈగా అనంత్‌కుమార్



**వంగర, ఫిబ్రవరి 4(వార్త):** వంగర మండలం గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ గా కొప్పర అనంత్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంజనీరింగ్ లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ఆయన గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా ఉద్యోగ బాధ్యతలు ఇంతవరకూచేశారు.ప్రస్తుతం వంగర హౌసింగ్ఇంచార్జీ ఏఈ పోస్ట్ ఖాళీకావటం తో ఇచ్చట హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ గా బాధ్యతలు అప్పగించారు. గతంలో ఆయన రాజుల గుమ్మడ , మడ్డువలస, భాగెమ్మపేట,సంగాం,వంగర గ్రామాలకు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏ ఈ అనంత్ కుమార్ మాట్లాడుతూ, గృహ నిర్మాణాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## చెరకు ట్రాక్టర్ బోల్తా..

# ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



**వంగర, ఫిబ్రవరి 4(వార్త):** అధికలోడుతో వస్తున్న రాజాం వంగర ప్రధాన రోడ్డు పై చెఱకు ట్రాక్టర్ మగ్గూరు గ్రామ సమీపంలో బోల్తాపడింది. ఈ ఏక్సిడెంట్ లో ఎవరికీ ఏటువంటి ప్రమాదం జరగ లేదు. చెరకులోడుతో బోల్తా పడిన ట్రాక్టర్ తో కొన్ని గంటలు ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందు లకు గుర య్యారు. రోడ్డు మీద అధికలోడుతో గల చెఱకు ట్రాక్టర్ బోల్తా పడటం తో చెరుకు ట్రాక్టర్ రోడ్డుపై పడి పోవటం తో ట్రాపిక్ కు కొన్ని గంటలు తీవ్ర అంతరా యం కలిగింది.దీంతోలారీలు, ట్రాక్టరు లు, వంగర రాజాం బస్ లకేకాకుండా,కనీసంమోటార్ సైకిల్ వెళ్ళటానికి అంతరాయం కలగటంతో ప్రయాణీకులు గంటల తరబడివుండవలసి వచ్చింది. రాజాంనుంచి వంగర వచ్చే అనేక వాహనాలు, వంగర, పార్వతీపురం తదితర అనేక గ్రామాల నుంచి వచ్చిన వాహనదారులు ఆర్ అండ్ బీ రోడ్డుకు అటు వైపు, ఇటువైపు కొన్ని గంటలు నిరీక్షించవలసి వచ్చింది. పోలీసులు రంగంలోకి దిగి చివరకు కొన్ని గంటలు తరబడిన అనంతరం రోడ్డు మీదపడిన చెర కును, ట్రాక్టర్‌ను బయటకు తీసారు. రేగిడి మండలం సంకిలి షుగర్ ఫ్యాక్టరీ కి తరలిస్తున్న చెఱకు ట్రాక్టర్ లు వల్ల ఈ మండల ప్రజలు, హైస్కూల్ తదితం పాఠశాలలకు వెల్లే విద్యార్థులుకు రహదారి ఇబ్బంది లు పడుతున్నామని సర్వత్రా ఆరోపణలు విని పిస్తున్నాయి. పోనీ కనీసం ఉదయం 10 గంటలు వర కైననూ పెద్ద,పెద్దలోడ్లుతో వెళ్లకుండా చూడాలని కోరుతున్నప్పటాకీ ఏ ఒక్కరు కూడా పట్టించు కోవటం లేదని సర్వత్రా మండిపడుతున్నారు.రోడ్డు మీదగా చెఱకు ట్రాక్టర్ వస్తున్నప్పుడుమండల కేంద్రం వంగర గ్రామం అంతే కాకుండాపలుగ్రామాల్లో నుండి వెళ్ళే టప్పుడు ఎదురుగా టు వీలర్ కూడా రాలేని పరిస్థితులు ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవటం లేదని సర్వత్రా విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ట్రాక్టర్ లమీద బారీ లోడ్లు కాకుండా కొంత చెఱకు తో ట్రాక్టర్ లను నడిపి ప్రజలు, ప్రయాణీకులకు, విద్యార్థులకు రహదారి ఇబ్బందులు లేకుండా చూడా లని మండల ప్రజలు కోరుతున్నారు. ఏఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది దగ్గర ఉండి చర్యలు చేపట్టారు.



# భక్తులకు 'అల్ట్రా టెక్' సిబ్బంది సేవలు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి దర్శనానికి వస్తున్న భక్తులకు శ్రీకాకుళం నగరంలో ఉచిత మజ్జిక పంపిణీ కార్యక్రమం చేపట్టారు. శ్రీకాకుళంకు చెందిన అల్ట్రా టేక్ సిమెంట్ కంపెనీ ఉద్యోగ ప్రతినిధులు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిక పంపిణీ చేపట్టారు. సుదూర ప్రాంతం నుండి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మజ్జిక అందించినట్లు సంస్థ ప్రతినిధులు శివప్రసాద్ పాణిగ్రాహి , సాయి ప్రసాద్, సాయికుమార్, తదితరులు తెలిపారు.

# టాలెంట్ టెస్టులో ఎర్రముక్కాం విద్యార్థి ప్రతిభ



**సోంపేట, ఫిబ్రవరి 4(వార్త):** సోంపేట మండలం ఎర్రముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి భర్తు నిఖిల్ రాష్ట్ర స్థాయిలో గత నెల 22న జరిగిన ఆన్లైన్ ఈఈ మెరిట్ టెస్టులో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హైస్కూల్ హెచ్ఎం అనంత తెలిపారు. ఈనెల 8న విజయవాడలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు సీల్డ్, ప్రశంసా పత్రం విద్యాశాఖ అధికారులు చేతులు మీదుగా అందుకుంటాడని ఆయన పేర్కొన్నారు విద్యార్థిని పాఠశాల కమిటీ ఛైర్మన్ తోట యాదవరావు ,రిటైర్డ్ హెచ్ ఎం అంబటి కృష్ణమూర్తి, ఎర్రముక్కాం, తోటవూరు, గ్రామ, యువజన సంఘాలు విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

# రాష్ట్ర పోటీలకు సత్యసాయి విద్యార్థిని



**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** రాష్ట్ర పోటీలకు ఎంపికైందని శ్రీ సత్య సాయి నిత్య విహార్ ట్రస్ట్ ఛైర్మన్ మల్ల రామేశ్వరం తెలిపారు.జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైందని చెప్పారు. శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణాపురం లో ఐదో తరగతి చదువుతున్న చిన్నారి గీత చరిష్మా ఆదివారం శ్రీకాకుళం లో జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రధమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థా యి పోటీలకు ఎంపిక అయింది అని తెలియజేశారు. ప్రిన్సిపల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# టీ, నీరు పంపిణీ చేసిన మాజీ సైనికులు

**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** రథసప్తమి సందర్భంగా అక్కుపల్లె శివసాగర్ బీచ్ లో మంగళవారం జరిగిన సముద్ర స్నానాల్లో భాగంగా కాశిబుగ్గ మాజీ సైనికుల ఆధ్వర్యంలో భక్తులకు టీ,మంచి నీటి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఇల్లమన్మధరావు మాట్లాడుతూ సైనికులకు సర్వీసులో ఉన్నంతకాలం సేవలు చేయడం వల్ల పదవీ విరమణ అయిన తర్వాత కూడా అదే బాటలో నడవాలని ఆకాంక్షతోనే ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా సూర్య నారాయణ స్వామివారి జన్మదిన సుభ సందర్భంగా సముద్ర స్నానం చేసే సూర్య నమస్కారం చేసుకుంటే భారతీయ సాంప్రదాయ పవిత్రత కు మారుపేరని అన్నారు. సుమారు పదివేల మంది భక్తులకు వరకు టి మంచిది సరఫరా చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పలాస కాశీబుగ్గ మాజీ సైనికులు అక్కు పెల్లి బైపల్లి మాజీ సైనికులు పాల్గొన్నారు. ఉపాధ్యక్షులు బంగారు బార్ కి కార్యదర్శి ఇప్పిలి తాతయ్య సహయ కార్యదర్శి భమ్మిడి బాబురావు, కోశాధికారి ఉప్పాడ వెంకటరావు డొంకాన వెంకట్రావు, అక్కుపల్లి నుంచి కోనేరు కృష్ణ, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.



# భక్తుల సేవలో తైక్వాండో శ్రీను సైన్యం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** అరసవల్లి రథసప్తమి ఉత్సవాల సందర్భంగా తైక్వాండో శ్రీను సైన్యం ఆతిద్యుని సేవలో నిమగ్నమైంది. ఆ సూర్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకి మంగళవారం పెద్ద ఎత్తున పులిహోరను పంపిణీ చేసింది. సింహద్వారం సమీపంలోని ఎస్.ఎన్ .కళ్యాణ మండపం వద్ద ప్రత్యేకంగా పులిహోర పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. తైక్వాండో శ్రీను సైన్యం ప్రతినిధులు పుక్కళ్ళ నవీన్ ,మజ్జి గౌతమ్ ,జోగిపాటి వంశీ, ఖాన్ , కెల్ల గిరి, శీర రుద్రరాజు ,పంకు మహేష్ ,పంకు మురళీ, పెయ్యల చంటి తదితరులు అంతా కూడా పులిహోర పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి మద్యాహ్నం వరకూ పులిహోరను భక్తులకి అందజేసారు. ఆదిత్యుని ఉత్సవాల సందర్భంగా సామాజిక సంస్థలు సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించగా తైక్వాండో శ్రీను సైన్యం కూడా మేము సైతం అంటూ భక్తుల సేవలో తరించారు.

# జాతీయ హరిత దళ క్లబ్‌కు పురస్కారం

**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) నిర్వహించిన గ్రీన్ స్కూల్స్ ప్రోగ్రాం లో భాగంగా పలాస మండలం లోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల లోని జాతీయ హరితదళ క్లబ్ (ఎన్జీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ హిత కార్యక్రమాలకు గాను గ్రీన్ స్కూల్స్ పురస్కారానికి ఎంపికయ్యింది మంగళవారం దేశ రాజధాని న్యూఢిల్లీ గల స్టేయిన్ ఆడిటోరియంలోని ఇండియా హేబిటేట్ సెంటర్లో జరిగిన కార్నివాల్ అవార్డుల ప్రధానోత్సవంలో సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ నుంచి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు అందుకున్నారు. జిల్లా విద్యాశాఖధికారి డా. తిరుమల చైతన్య, ప్రధానోపాధ్యాయులు ఎస్వీ. రమణారావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఆర్. బాలాశంకరం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

రథసప్తమి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానానికి ప్రముఖులు పోటెత్తారు. కేంద్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఎమ్మెల్యేలు, పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. అలాగే జిల్లా ఉన్నతాధికారులు సైతం స్వామి వారి దర్శనానికి బారులు దీరారు.




















జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్వచ్ఛంద సేవలు భేష్

శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి4 (వార్త): రథసప్తమి వేడుకలు సంద ర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు, వ్యాపార సంఘాలు భక్తులకు స్వచ్ఛందంగా సేవలు అందించారు. మంచినీరు, మజ్జిగ, పులిహోరా, చక్రపొంగలి, దద్దోజనం, సాంబారు అన్న ప్రసాదాన్ని పంచిపెట్టారు. రెడ్‌క్రాస్, తదితర శాఖలు సైతం సేవలు అందించాయి. వృద్ధులు స్వామి వారి దర్శనం చేసుకునేలా పోలీసులు సహకరించారు. వైద్యఆరోగ్యశాఖ పలుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. నగరపాలక సంస్థ సిబ్బంది సేవలు అందించింది.
































Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546